క్లుప్తంగా

రేపు సీతారాముల కల్యాణోత్సవం

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని ఉప్పర పల్లె గ్రామంలో ఉన్న శ్రీసద్గురు సమర్థ నారాయణ స్వామి ఆశ్రమంలో శనివారం ఉదయం సీతారాముల కల్యాణమహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆశ్రమ పీఠాధిపతి గోపాల స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణ మహోత్సవంతోపాటు సీతారామలక్ష్మణల చిత్రపటాలతో శోభాయాత్ర నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా హానిమాన్ జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో హోమియో వైద్య పితామహుడు డాక్టర్ సామ్యూల్ హానిమాన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. గురువారం హానిమాన్ జయంతిని ఆయుష్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ వైద్యులు అపర్ణ శ్రీరాం, నిరంజన్ మాట్లాడుతూ హోమియో వైద్యరంగానికి హానిమాన్ చేసిన సేవలు ఎనలేనివని, ఆయన జయంతిని ప్రపంచ హోమియో వైద్య దినోత్సవంగా జరుపుకొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆయుష్ ఫార్మసిస్ట్ మహేశ్వరయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

పోరుమామిళ్ల : అర్హులైన పేదవారందరికీ ఇల్లు, ఇంటిస్థలం ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు వీరశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరశేఖర్ మాట్లాడుతూ పేదవాడి సొంతింటి కల నెరవేరేదెప్పుడని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారానికి ఎందుకు కృషి చేయడం లేదన్నారు. ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్, కార్యవర్గసభ్యులు రమణ, కేశవ, చెన్నయ్య, సునీల్, ప్రసాద్, శ్రీనివాసులు, రవీంద్ర, షాహిదా, జ్యోతి పాల్గొన్నారు.

పాట ఆవిష్కరణ

కాశినాయన : సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి అందించిన సేవలపై రూపొందించిన పాటను గురువారం సేవాశ్రమంలో రామకృష్ణారెడ్డి తల్లి మహాలక్ష్మమ్మ ఆవిష్కరించారు. 15 ఏళ్లుగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టి కొనసాగిస్తున్నామని రామకృష్ణారెడ్డి తెలిపారు. సిరిగిరిశివ, పి.నారాయణరెడ్డి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం పెద్ద సంఖ్యలో అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ద్వార్శల గురునాథరెడ్డితోపాటు ద్వార్శల బ్రదర్స్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, మాడెం సందీప్, సోములవారిపల్లె ఒకటో ఎంపీటీసీ గోటూరు బాలగురమ్మ వెంకటేష్, భూమిరెడ్డి నాగార్జునరెడ్డి, గోపవరం ఉపసర్పంచ్ అభ్యర్థి బీరం రాఘవేంద్రారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

ఎద్దు మృతి

చాపాడు : మండల పరిధిలోని చియ్యపాడు గ్రామ సమీపంలో వరి ధాన్యం బస్తాలను తీసుకెళ్లే క్రమంలో గురువారం సాయంత్రం ఎద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన జి.అంకన్న అనే రైతు తన ఎద్దుల బండిపై వరి ధాన్యం బస్తాలను బియ్యంగా చేసుకునేందుకు మిషన్ వద్దకు బయలుదేరాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలో వంక దగ్గర ఒక్క సారిగా ఓ ఎద్దు ఉన్నట్టుండి కుప్పకూలి కింద పడిపోయింది. వెంటనే బాధిత రైతు పశు వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లుకు సమాచారం ఇచ్చాడు. ఆయన వచ్చి ఎద్దును పరిశీలించగా అప్పటికే ఎద్దు మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఏపీపీ నియామకం

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మార్తల సుధాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. గతంలో కూడా సుధాకర్‌రెడ్డి మూడు సార్లు ఏపీపీగా పని చేశారు.

బ్రహ్మోత్సవం చూతము రారండి

- ముక్తిరామలింగేశ్వరుడికి బ్రహ్మోత్సవ శోభ
- రేపు కల్యాణోత్సవం, 20న రథోత్సవం
- ఉత్సవాలకు సర్వం సిద్ధం



ముక్తిరామలింగేశ్వరాలయం



రాజరాజేశ్వరి అమ్మవారు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు పట్టణంలోని పావన పినాకినీ నది తీరాన వెలసిన సుప్రసిద్ధ క్షేత్రమే ముక్తి రామలింగేశ్వర ఆలయం. ఈ ఆలయంలో సాక్షాత్తు శ్రీరామచంద్రుడు శివలింగాన్ని ప్రతిష్ఠించారని ప్రతీతి. మార్జాలరూపంలో గల రావణున్ని రాముడు తన బాణంతో వధించి ముక్తి ప్రసాదించడం వల్ల ఈ ప్రాంతానికి ముక్తి రామలింగేశ్వరమని పేరు వచ్చింది. రావణ వధ అనంతరం తనకు ఆపాదితమైన బ్రహ్మహత్యాదోషణ నివారణకు ఈ ప్రాంతంలో శివలింగం ప్రతిష్ట చేయ సంకల్పిస్తారు. రాముడు ఆంజనేయస్వామిని కాశీ నుంచి శివలింగం తీసుకురమ్మని ఆజ్ఞాపించడంతో ముహూర్త సమయానికి ఆంజనేయుడు రాకపోవడంతో శ్రీరామచంద్రుడు ''సైకత లింగం'' (ఇసుకతో చేసిన శివలింగం) ప్రతిష్ఠించారు. తర్వాత అంజనేయస్వామి వచ్చి తాను తెచ్చిన శివలింగాన్ని ప్రతిష్ఠించాలని పట్టుబట్టగా శ్రీరామచంద్రుడు ఆయన తెచ్చిన శివలింగాన్ని సైకత లింగానికి కొద్ది దూరంలో అభిముఖంగా ప్రతిష్ఠించారు. ఈ లింగాన్ని హనుమత్ లింగేశ్వరుడుగా పిలుస్తారు. సైకత లింగంపై శ్రీరాముల వారి గుర్తులను ఇప్పటికీ మనం దర్శించవచ్చు. శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం పక్కన శ్రీ రాజరాజేశ్వరి దేవీ ఆలయంలో రాజరాజేశ్వరి దేవీ, చండీమాత, ఆది శంకరాచార్యుల వారు ప్రతిష్ఠించిన శ్రీ చక్రయంత్రం ఉంది. హనుమత్ లింగేశ్వరునికి భక్తులు స్వయంగా అభిషేకాలు చేయడం విశేషం.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ముక్తిరామలింగేశ్వరుని బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి 22వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, రాత్రి 7గంటలకు ఎదురుకోళ్ల ఉత్సవం, శనివారం సాయంత్రం గంగా రాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరుని కల్యాణోత్సవం, 12 సాయంత్రం హంసవాహనం, 13న నెమలి, 14న పెద్దపులి, 15న రావణబ్రహ్మ, 16న వెండిపర్వతం, 17న శేషవాహనం, 18న నంది, 19న గజవాహనం, 20న రథోత్సవం మధ్యాహ్నం అన్నదానం, 21న వసంతోత్సవం, త్రిశూల స్నానం, అశ్వవాహనం, 22న సాయంత్రం ఊంజల్‌సేవ, పుష్పయాగం, ఏకాంతసేవ చేయనున్నారు. వీటితోపాటు రోజూ ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అర్చనలు, జపహోమాలు వేదపండితుల ఆధ్వర్యంలో జరుగనున్నాయి. 21న రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలు జరుగనున్నాయి. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

వైభవంగా సీతారాముల గ్రామోత్సవం



ఊరేగింపులో సీతారామలక్ష్మణులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఆంధ్రకేసరి రోడ్డులోని సీతారామాలయంలో ఆలయ 16వ వార్షికోత్సవాలను గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వాముల విగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఊరేగింపులో చెక్కభజన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని, భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, గురుప్రసాద్, రమణయ్య కోరారు.

మాతా శిశు మరణాలు నియంత్రించాలి

బద్వేలు అర్బన్ : మాతా శిశు మరణాలు సంభవించకుండా క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్ పేర్కొన్నారు. గురువారం తొట్టిగారిపల్లె పీహెచ్‌సీలో ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ సురక్షిత కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు గైనకాలజిస్టు డాక్టర్ శివలలిత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు ప్రసవం అయ్యేంత వరకు పర్యవేక్షిస్తుండాలని కోరారు. అలాగే పౌష్టికాహారం వలన కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించాలని కోరారు. రక్తహీనత, రక్తపోటు వంటి సమస్యలు లేకుండా చూడాలని కోరారు. అనంతరం గర్భిణులకు వీరపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం సిబ్బంది సమకూర్చిన అల్పాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్, సీహెచ్‌ఓ చంద్రావతి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం తప్పనిసరి

చాపాడు : గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ పేర్కొన్నారు. మండల కేంద్రమైన చాపాడు-2 అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే రక్తహీనత లేకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే ఫుడ్‌ను తీసుకోవాలని, వీటి వలన అనేక రకాలైన లాభాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, అంగన్వాడీ వర్కర్లు మహాలక్ష్మీ, రోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి ఖాజా మొయినుద్దీన్

చాపాడు : ప్రజలు కోర్టుల ద్వారా న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మైదుకూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఖాజా మొయినుద్దీన్ అన్నారు. మండలంలోని వెదురూరు గ్రామంలో గురువారం సాయంత్రం మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలు, న్యాయ సేవలపై అవగాహన కలిగి ఉండాలని తద్వారా అన్యాయం జరిగినప్పుడు కోర్టుల ద్వారా న్యాయం పొందవచ్చన్నారు. పుట్టబోయే బిడ్డ నుంచి మృతి చెందే వరకూ ప్రతి ఒక్కరికీ చట్టాలు వర్తిస్తాయన్నారు. తల్లిదండ్రులు పిల్లలు ఆస్తులు రాసిచ్చే క్రమంలో సరైన అధారాలతో రిజిస్ట్రేషన్లు చేయించాలని, అగ్రిమెంట్లు మాత్రమే చేస్తే వాటికి చట్టపరమైన గుర్తింపు లభించదన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు సెల్ ఫోనులు వాడకంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటిని అవసరం మేరకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాహనదారులు వాహనాలు నడిపే క్రమంలో హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని వీటి ద్వారా రోడ్డు ప్రమాదాల్లో బయటపడే అవకాశం చాలా వరకు ఉంటుందన్నారు. చట్టానికి అందరూ సమానమేనని ప్రతి ఒక్కరూ దానికనుగుణంగా నడుచుకోవాల్సిందేనని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు న్యాయవాదులు అందుబాటులో ఉంటారని వీరి ద్వారా కోర్టుల్లో అన్యాయం జరిగిన వారు న్యాయం పొందవచ్చన్నారు. మే నెల 10వ తేదీన మైదుకూరు లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, దీని ద్వారా ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కానీ సమస్యలు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కేసుల్లో ఉన్న బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నాగేంద్ర ప్రసాద్, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరి శివరామ్, ప్యానల్ అడ్వకేట్‌లు ఎస్.శివరామకృష్ణ, నానుబాల శ్రీనివాసులు, అడ్వకేట్‌లు ఎస్.కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

వడ్డీలో 50 శాతం రాయితీ

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపాలిటీకి సంబంధించి ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు ఈనెలాఖరు లోపు చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీని ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం జీఓఎంఎస్ నంబర్ 66 జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నులు ఈనెల 30వ తేదీలోపు ఏక మొత్తంగా చెల్లించిన వారికి ఆస్తి పన్నులో 5 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని పౌరసేవా కేంద్రంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు వరకు సెలవు దినాల్లో కూడా పన్నులు చెల్లించవచ్చని తెలిపారు. పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఆ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

బద్వేలు అర్బన్ : ఇటీవల బద్వేలు పట్టణంలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలు చోటు చేసుకున్న పాఠశాలలైన లిటిల్‌ఫ్లవర్ స్కూల్, ఏవీఆర్ స్కూల్‌ల గుర్తింపు రద్దు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఎంఈఓ రఘురాములుకు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులను కన్నబిడ్డలుగా చూసుకోవాల్సిన ఉపాధ్యాయులు వేధింపులకు గురి చేయడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించి అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులపై కేసు నమోదు చేయడంతో పాటు సంబంధిత పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్ షరీఫ్, ఆదిల్, ఉపాధ్యక్షులు యువరాజ్, సుధాకర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి



రాజీవ్ సర్కిల్‌లో గ్యాస్ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ప్రొద్దుటూరు రూరల్ : పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గ్యాస్ ధరల పెంపుపై గురువారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ సర్కిల్‌లో ఖాళీ సిలిండర్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మూడో సారి అధికారంలోకి వచ్చి ప్రజలపై అనేక భారాలు మోపుతోందన్నారు. ఒక్కో గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచడం పేదవారికి భారమేనన్నారు. గతంలో గ్యాస్ సబ్సిడీ మొత్తం రూ.350 నుంచి రూ.400 వరకు గ్యాస్ వినియోగదారుని అకౌంట్‌లో జమ చేసేవారన్నారు. ప్రస్తుతం ఒక్కో సిలిండర్ వెయ్యి రూపాయలు పెట్టి కొనాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పేది ఒకటి, చేసేది ఒకటి విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు బాబు, పక్కీరయ్య, శేఖర్, చెన్నారెడ్డి, మురళి, శారద, శ్రీను, శివ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సామాన్య జనం నడ్డి విరుస్తున్న ప్రభుత్వాలు

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



పోరుమామిళ్ల : పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమవుతున్న పేద, సామాన్య ప్రజలకు గ్యాస్ ధర పెంపు గోరుచుట్టుపై రోకటి పోటులా మారిందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఒక్కో సిలిండర్‌పై రూ. 50 పెంపు వంటింట్లో మంటలు పుట్టిస్తున్నాయన్నారు. కొన్ని రోజులుగా వాణిజ్య సిలెండర్ ధరలు పెంచుతున్న ప్రభుత్వం తాజాగా గృహ వినియోగదారులకు వాత పెట్టిందన్నారు. తాజా పెంపుతో రూ. 853 నుండి రూ. 903కు చేరిందన్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టయిందన్నారు. సూపర్‌సిక్స్‌లో భాగంగా ప్రవేశపెట్టిన ఉచిత సిలిండర్లు చాలా మందికి అందడం లేదన్నారు. తొలివిడత కింద ఇప్పటి వరకు నలభై శాతం మందికి రాయితీ డబ్బు వారి ఖాతాల్లో జమ కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పిన మాటకు కట్టుబడి ఆ మేరకు చర్య తీసుకోవాలని ఎమ్మెల్సీ కోరారు.

చదువుతో పాటు విజ్ఞానం పెంపొందించుకోవాలి

చాపాడు : ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు మారుతున్న కాలానుగుణంగా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సీబీఐటీ చైర్మన్ డా.వి.జయచంద్రారెడ్డి అన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో గురువారం సీఎస్ఈ, సీఎస్ఈ(డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంజనీరింగ్, మెషిన్ లెర్నింగ్) అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో అవిన్యా 2క25 సింపోయిజమ్ పేరుతో 24 అవర్స్ హాకథాన్, టెక్నికల్ క్విజ్, పీపీటీ, కోడింగ్ కాంపిటీషన్, వెబ్ డిజైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సీబీఐటీ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు టెక్నికల్ ఇతర కార్యక్రమాలలో పాల్గొనాలని వీటిల్లో ప్రావీణ్యం పొంది సర్టిఫికెట్లు సంపాదించాలన్నారు. వీటి ద్వారా చదువు అనంతరం భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలలో ఉపయోగపడతాయన్నారు. సీబీఐటీ డైరెక్టర్ అడ్మిన్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపల్ డా.ఎస్.శృతి, ఆర్ అండ్ డీ డా.ప్రసన్న వెంకటేషన్, సీఎస్ఈ విభాగాధిపతులు డా.దశరథరామిరెడ్డి, మాధురి పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, పట్టుదలతో కృషి చేయాలని యోగివేమన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్లం శ్రీనివాసరావు తెలిపారు. వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవ వేడుకలను గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్న చిన్న కళాశాలలు, చిన్న పట్టణాల్లో చదువుకున్నామని భయపడాల్సిన అవసరం లేదని, తెలుగు మీడియం విద్యార్థులు ఇంగ్లీషు మీడియం విద్యార్థులకు ఎంత మాత్రం తీసిపోరన్నారు. భయం ఉన్నప్పుడే పట్టుదల పెరుగుతుందని, పట్టుదలతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థులు నీతి, నిజాయితీ, నైతిక విలువలతోపాటు మానవత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నూతన విద్యావిధానం 2020 అమలు చేస్తోందని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, కళాశాల డీన్ ప్రొఫెసర్ కేవీ రమణయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జయరామిరెడ్డి, ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, ప్రొఫెసర్ నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయని చంద్రబాబు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామయ్య

ప్రొద్దుటూరు : ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా అమలు చేయలేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య విమర్శించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మూడో రోజు గురువారం సీపీఐ ఆధ్వర్యంలో ఇంటి స్థలాలు, టిడ్కో ఇళ్లు, సాగుభూమి సాధనకై రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా బి.రామయ్య చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 3 సెంట్లు, రెండు ఎకరాల సాగు భూమి మంజూరు చేసి నిలబెట్టుకోవాలన్నారు. రాజకీయ నాయకులు, కొంత మంది అవినీతి రెవెన్యూ అధికారులు కలిసి డీకేటీ భూములను, దళిత, గిరిజన, ఆదివాసీలకు చెందిన భూములను, వాగు, వంక పోరంబోకు, డీ నోటిపై భూములను అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. ఆక్రమణదారుల చేతుల్లో మిగులు భూములు లక్షల ఎకరాల్లో ఉన్నాయని, వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలను పెంచమని చెప్పిన సీఎం చంద్రబాబు విద్యుత్ చార్జీలను పెంచారని, పర్యావసానంగా రూ.లక్షా 50వేల కోట్లు ప్రజలపై భారం పడేలా రంగం సిద్ధం చేశారని వెల్లడించారు. గ్యాస్ ధరలు పెంచమని హామీ ఇచ్చి నేడు సిలిండర్‌పై రూ.50 పెంచారని పేర్కొన్నారు. ఈ దీక్షలో సీపీఐ ఏరియా సమితి కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సభ్యులు గోపాలం, రామకృష్ణ, వై.హరి, మద్దిలేటి, మచ్చా శీను, దేవరశెట్టి నరసింహా, మీరావలి, నాబయ్ రసూల్, చెన్నమ్మ, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి పీటర్, సహాయ కార్యదర్శి నాని, తౌసిఫ్ పాల్గొన్నారు.

నింగి నుంచి నిఘా





మారుతున్న కాలానికి అనుగుణంగా అందుబాటులోకి వస్తున్న సాంకేతికతతో నిర్ణీత లక్ష్యాలను క్షణాల్లో పూర్తి చేస్తున్నారు. ఒక్కోసారి మానవులకు సాధ్యంకానీ పనులకు సాంకేతికత సాయం అందిస్తోంది. అలాంటి సాంకేతికత డ్రోన్ల రూపంలో అసాధ్యం అనుకున్న లక్ష్యాలను సుసాధ్యం చేస్తోంది. అందువల్ల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడానికి పోలీసులు డ్రోన్‌లను అస్త్రంగా వినియోగిస్తున్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు దృష్టి సారించారు. ఇందుకోసం గురువారం ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు శివారు ప్రాంతంలో డ్రోన్ కెమెరాతో జల్లెడ పట్టారు. అనుమానాస్పదంగా సంచరించేవారిపై నిఘా ఉంచడంతో పాటు గంజాయి సేవిస్తున్న, విక్రయిస్తున్న వారి కోసం డ్రోన్ కెమెరాతో విస్తృతంగా గాలిస్తున్నారు. ఎర్రగుంట్ల రోడ్డు, పాలకేంద్రం పరిసరాలు, ఏకోపార్కు, పెన్నానది పరీవాహక ప్రాంతం, ఆర్టీపీపీ రోడ్డు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, పెన్నానగర్, ఇసుకదిన్నెలు, పెద్దశెట్టిపల్లె గ్రామ శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాతో శోధించారు. ఎక్కడైనా గంజాయి సేవించినా, విక్రయించినా పోలీసులకు సమాచారం అందించాలని సీఐ ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. –ప్రొద్దుటూరు క్రైం